ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 16 సెప్టెంబరు 2025

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి: ఎస్పీ



సమస్యలు వింటున్న ఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చిన వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను ఎస్పీ జగదీష్ అర్జీల రూపంలో స్వీకరించారు. రస్తా తగాదాలు, భూ సమస్యలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు తదితర సమస్యలపై ప్రజలు పిటీషన్లు ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 121 పిటీషన్లు ఇచ్చారు. తర్వాత ఎస్పీ జగదీష్ సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదులకు చట్టపరిధిలో సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. తర్వాత నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయం పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ హరినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లలో నీటి ఊట

- ఆందోళనలో బెళుగుప్ప గ్రామస్థులు

(6లో..)



పొలికేక ఢిల్లీకి వినిపించాలి

- ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలి
- నినదించిన అనంత జనవాహిని
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'అనంత ప్రజల పొలికేక ఢిల్లీకి వినిపించాలి. ఆర్డీటీకి విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్ఏ)ను రెన్యువల్ చేయాలి' అని ఆర్డీటీ లబ్ధిదారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో పొలికేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు సాగిన భారీ ర్యాలీతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిలపక్ష కమిటీ నాయకులు డాక్టర్ అక్కులప్ప, బీసీఆర్ దాస్, సాకేహరి, యల్లన్న, ఉమామహేశ్వరి మాట్లాడారు. ఆరు దశాబ్దాల ఆర్డీటీ ప్రయాణంలో అనంతపురం ఉమ్మడి జిల్లాకు ఎంతో మంచి జరిగిందన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా కుంటలు, చెక్‌డ్యాంలు ఆర్డీటీ వారు నిర్మించారన్నారు. ఉపాధి మార్గాలు చూపి, ఉచిత విద్య, వైద్యం అందించిందని కొనియాడారు. ఇలా పేద కుటుంబాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీకి ఆర్థిక వనరులు స్తంభింప చేయడం దారుణమని మండిపడ్డారు. ఎఫ్‌సీఆర్ఏను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. ప్రతి గ్రామం, వీధి నుంచి వేలాదిగా ప్రజలు (మిగతా 6లో....)

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

- డీపీఓ నాగరాజనాయుడు



మాట్లాడుతున్న డీపీఓ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజనాయుడు.. ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పన్ను వసూళ్లలో వెనుకబడిన పంచాయతీలకు సంబంధించి డిప్యూటీ ఎంపీడీఓలు, సంబంధిత కార్యదర్శులతో స్థానిక డీఎల్‌పీఓ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. పన్ను వసూళ్లకు డెడ్‌లైన్ విధించారు. ఆలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో బకాయిలు రూ.3 కోట్ల వరకు ఉండగా.. అందులో అనంతపురం రూరల్‌లోనే రూ.కోటి ఉండడం శోచనీయమన్నారు. నెలాఖరులోగా వసూలు చేయాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మెమోలు జారీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన తాడిపత్రి మండలంలోని పలు పంచాయతీల సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజనాయుడు సోమవారం మెమోలు జారీ చేశారు. తాడిపత్రి మండలంలోని పలు పంచాయతీల్లో అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు.. డీపీఓకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అందుకు అనుగుణంగా డీపీఓ నాగరాజనాయుడు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సిబ్బంది చర్యలు చేపట్టకపోవడంతో అందుకు డీపీఓ నాగరాజనాయుడు బాధ్యత వహించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే గత నెలలో డీపీఆర్సీ మీటింగ్ హాల్‌లో సమావేశం నుంచి బయటకు వచ్చిన డీపీఓను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి దుర్భాషలాడడం దుమారం రేపింది. ఈ నేపథ్యంలో తాడిపత్రి మండలంలోని వెంకటరెడ్డిపల్లి, తేరన్నపల్లి, గంగిరెడ్డిపల్లి పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత సిబ్బందితో ప్రతి శుక్రవారం నివేదిక తీసుకుని, తనకు అందజేయాలని డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌ను డీపీఓ ఆదేశించినట్లు తెలిసింది. ఆ మేరకు ఈఓఆర్డీ, కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజులుగా నివేదికలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందికి సోమవారం మెమోలు జారీ చేశారు.

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్టాపింగ్

7

ఆదర్శప్రాయుడు.. మోక్షగుండం: ఎస్ఈ



నివాళులు అర్పిస్తున్న పీఆర్ ఎస్ఈ, కార్యాలయ సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడని పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న సుబ్బరాయుడు కొనియాడారు. మోక్షగుండం జయంతిని పురస్కరించుకొని తన కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఇంజనీర్లు ఆయన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో పీఏ టూ ఎస్ఈలు రాజేంద్రప్రసాద్, చంద్రకుమార్, శ్రీనివాసమూర్తి, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈలు శ్రీనివాస్ కుమార్, తిరుపాల్ నాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయినా.. తప్పిదాలా..?

- డీఎస్సీ ఎంపిక జాబితాలో అనర్హుడి పేరు
- కమిషనర్, ఆర్జేడీ ఆగ్రహం
- అధిక మార్కులు వచ్చినా... జాబితాలో అడుగున పేరు
- తల పట్టుకున్న డీఈఓ
- బాధ్యులను గుర్తించే పనిలో నిమగ్నం

అనంతపురం విద్య, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ప్రక్రియను రాష్ట్ర అధికారులే పర్యవేక్షించారు. అక్రమాలకు తావులేకుండా జాబితాలను సైతం అక్కడి నుంచే పంపారు. జిల్లాలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అయినా.. తప్పిదాలు దొర్లాయి. ఫైనల్ జాబితాను సైతం జిల్లాకు మాన్యువల్‌గా పంపారు. మరోసారి రోస్టర్, కేటగిరీల వారీగా పరిశీలన చేసి, అనంతరం కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, జిల్లా కమిటీతో ఆమోదం వేయించుకోవాలని ఆదేశాలిచ్చారు. అయినా డీఎస్సీ ఫైనల్ జాబితాలో అనర్హుడికి పోస్టు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది.



కాల్‌లెటర్ వచ్చినా ఎంపిక జాబితాలో పేరు లేదని డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

వైద్యుడు సర్టిఫికెట్ ఇచ్చినా..

బుద్ధిమాంద్యం (ఎంఐ) కోటా ప్రత్యేకంగా ఉంటుంది. అభ్యర్థి తీసుకుంటున్న చికిత్సలు, వ్యవహారశైలిని బట్టి ఈ కోటాకు ఎంపిక చేస్తారు. కురుబ శ్రీనివాసులు అనే అభ్యర్థి డీఎస్సీ రాశారు. ఆయనకు ఎంఐ కింద అర్హత (మిగతా 7లో...)

ఇంటికే స్మార్ట్ రైస్ కార్డులు

- ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



స్మార్ట్ రైస్ కార్డు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరికీ ఇళ్లవద్దనే పంపిణీ చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. నగరంలోని అశోక్‌నగర్‌లోని సచివాలయ ఉద్యోగుల ద్వారా రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రైస్ కార్డులను ఇన్‌చార్జి కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా 6,57,248 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ జరిగిందన్నారు. కార్డుల పంపిణీలో ఇబ్బందులు కలిగించవద్దని తహసీల్దార్లు, సీఎస్‌డీటీలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించండి

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, మల్లికార్జునుడు, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ హాజరయ్యారు. ప్రజల నుంచి 334 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో విచారించాలని, బాధితులు సంతృప్తి చెందేలా గడువులోగా పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా చూడాలని అన్నారు.

మైనర్.. రయ్ రయ్..!



యాడికిలో బైక్‌లో దూసుకెళ్తున్న విద్యార్థులు

యాడికి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ రాదు. రోడ్డు నిబంధనలు అస్సలే తెలియవు. తెలిసిందల్లా ఒక్కటే.. ఎక్స్‌లేటర్ లాగడమే. అది ఎంత ఉంటే.. అంతా లాగేస్తుంటారు. గాలిలో తేలిపోతుంటారు. ఏదైనా ఉన్నట్లుండి అడ్డుగా వస్తే.. బైక్‌ను అదుపు చేయడం కూడా రాదు, చేతకాదు. అయినా.. బైక్‌లు వేసుకుని, రోడ్లపైకి యథేచ్ఛగా వస్తున్నారు మైనర్లు. ఒకే బైక్‌పై ముగ్గురు కూడా వెళ్తున్నారు. అది కూడా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. అతివేగంగా నడుపుతున్నారు. అంతేకాదు, స్టంట్లు చేస్తున్నారు. ఇలాంటివి మండల కేంద్రంలో నిత్యకృత్యమయ్యాయి. వాటిని చూసిన స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. పిల్లలకు బైక్‌లు ఇస్తున్న తల్లిదండ్రుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మైనర్ల బైక్ సవారీలు పోలీసులకు కనబడవా అని ప్రశ్నిస్తున్నారు.



బైక్‌పై వెళ్తున్న ముగ్గురు విద్యార్థులు (చేతిలో సెల్‌ఫోన్‌లతో..)

పోలీసుల ఒత్తిడితో గుండెపోటు

- గిరిజనుడి మృతి
- మృతదేహంతో స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన



శింగనమల పోలీస్ స్టేషన్ వద్దకు రామకృష్ణ నాయక్ మృతదేహాన్ని స్ట్రెచర్‌పై తీసుకువెళుతున్న బాధిత కుటుంబ సభ్యులు, రామకృష్ణ నాయక్ (ఫైల్)

6

కోలుకునేది ఎలా..?

భారీగా తగ్గిన టమోటా ధర

నెల కిందట 25కిలోల బాక్స్ రూ.800

నేడు రూ.150 నుంచి రూ.200 కూడా కష్టమే

నష్టాల్లో రైతులు

6

కిలేడీలు..!

- బ్యాంకుల వద్ద రెక్కీ
- ఖాతాదారులను వెంబడించి.. నగదు అపహరణ
- 14 రోజుల వ్యవధిలో 10 చోరీలు
- అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా అరెస్టు
- రూ.7.5 లక్షల నగదు, కారు స్వాధీనం

7

పొలికేక ఢిల్లీకి వినిపించాలి

(5వ పేజీ తరువాయి)

స్వచ్ఛందంగా తరలివచ్చినా ప్రభుత్వాలకు కనువిప్పు కలగకపోతే భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. పొలికేక కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందించారు. పొలికేకకు మద్దతుగా బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప ఆధ్వర్యంలో న్యాయవాదుల జేఏసీ తరలివచ్చి సంఘీభావాన్ని తెలిపింది. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రామాంజనేయులు, అంజి, కుళ్లాయప్ప, సూరి, దొడ్డప్ప, బానాసీ శీన, రామకృష్ణ, హరిగోపాల్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.





బారికేడ్లను తోసుకుని వస్తున్న జనం, కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన జనసందోహం

ఇబ్బంది పడాల్సిందే..



మా ఊర్లో తాగడానికి నీళ్లులేవు. దీంతో చెర్లోపల్లికి వెళ్లి తెచ్చుకుంటున్నాం. మా ఊర్లోనే ఫిల్టర్ ట్యాంక్ కట్టిస్తామని ఆర్డీటీ చెప్పింది. ప్రస్తుత ఇబ్బందులతో డబ్బులు లేక ఫిల్టర్ ట్యాంక్ కట్టడంలేదు. స్కూల్ కట్టించినా ఓపెన్ చేయడంలేదు. ఆర్డీటీలేకుంటే ఇబ్బందులు పడాల్సిందే.

-మాలేపల్లి మహిళలు, కుందుర్పి మండలం

ఇల్లు కట్టించారు



మాకు సొంత ఇల్లు కట్టించారు. పొదుపు సంఘంలో రుణాలిచ్చారు. నా కుమారుడు డిగ్రీ, ఇద్దరు కుమార్తెలు ఇంటర్మీడియేట్ చదివారు. వారి విద్యకు ఆర్డీటీనే ఆర్థిక సాయం చేసింది. ఐదో తరగతి వరకు ఆర్డీటీ పాఠశాలలోనే చదివారు. మాలాంటి పేదలకు ఆర్డీటీనే దిక్కు. ప్రభుత్వం కరుణించి ఆర్డీటీని కాపాడాలి.

-రామలక్ష్మి, కొడపగానిపల్లి, కొత్తచెరువు మండలం

రుణాలు ఇచ్చారు



పదిమంది మహిళలను ఒక పొదుపు సంఘంగా ఏర్పాటు చేసి రుణాలిచ్చారు. దాని ద్వారా గేదెలు, గొర్రెలు పెంచుకుని డబ్బులు సంపాదించేవాళ్లం. చేన్లలో కుంటలు తవ్వించి, చెక్ డ్యాంలు కట్టారు. గవర్నమెంట్ రూమ్‌ల కంటే మంచి ఇళ్లను ఆర్డీటీ కట్టించింది. ఇప్పుడేమి పనులు చేయడంలేదు.

-పెద్దక్క, లక్ష్ముంపల్లి, పెద్దవడగూరు మండలం

ఐదుగురిని చదివించింది



నాకు ఐదుగురు పిల్లలుంటే వారందరినీ ఆర్డీటీనే చదివించింది. అన్నం కూడా ఆర్డీటీ స్కూల్లోనే పెట్టేవారు. ఒక ఎకరా భూమి లేని మాలాంటి పేదలకు చదువులు, ఆస్పత్రులు, కూలి పనులు అన్ని ఆర్డీటీనే చూసుకుంది. ఇప్పుడు మూసివేస్తే ముందు తరాలు ఏమికావాలి.

-లక్ష్మక్క, మాలేపల్లి, కుందుర్పి మండలం

15 మందికి ఉద్యోగాలు



నా కొడుకును ఆర్డీటీనే ఇంజనీరింగ్ చదివించింది. కుమార్తెను బీఫార్మసీ చదివిస్తోంది. ఆర్డీటీ చదివించిన 15మంది పిల్లోల్లు మా ఊర్లో ఉద్యోగాలు సాధించారు. ఒక పిల్లోడు డాక్టర్ అయినాడు. పొదుపు సంఘంలో రుణాలు ఇచ్చినారు. పాడి ద్వారా ఉపాధి పొందడానికి గేదెలు ఇచ్చారు. ఆర్డీటీ లేకుంటే మేములేము.

-అక్కమ్మ, బొందలవాడ, నార్పల మండలం

ఆర్డీటీని దూరం చేస్తున్నారు..



పొదుపు సంఘంలో ఉన్నవారికి రూ.25వేల చొప్పున రుణం ఇచ్చారు. గ్రామ స్వరాజ్యం కింద 79మందికి రూ.20వేల ప్రకారం బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లాగా చేశారు. ఆ డబ్బులు అట్లే ఉంటాయి. వడ్డీ మాత్రమే వాడుకుంటాం. చేన్లో పంటపెట్టుకునేకి రాళ్లు ఏరివేసే పేరుతో డబ్బులు ఇస్తున్నారు. పెట్టుబడికి వినియోగించుకుని పంట వచ్చినప్పుడు కడుతున్నాం. పిల్లోల్లకి బియ్యం, బాళ్లు, గోధుమలు, నూనే, దుస్తులు అన్నీ ఇస్తున్నారు. అలాంటి ఆర్డీటీని మాకు దూరం చేయాలని చూస్తున్నారు.

-పాలవెంకటాపురం మహిళలు, బ్రహ్మసముద్రం మండలం

వానవాన వొద్దప్పా..!

- కొన్ని రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు
- తీవ్రంగా నష్టపోతున్న వేరుశనగ రైతులు
- కట్టె, కాయలు నల్లగా మారుతున్నాయని ఆందోళన

కంబదూరులో తొలగించిన వేరుశనగ కట్టె అంతా నల్లగా మారిన దృశ్యం



కళ్యాణదుర్గం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో అన్నదాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కోతకోసిన పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నాడు. ఖరీఫ్ ఆరంభానికి ముందే బారుబావుల కింద వేరుశనగ సాగుచేశారు. పంట కాలం పూర్తవడంతో వేరుశనగను తొలగించారు. అయితే వర్షాలు తెరిపిలేకుండా కురుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా వర్షాలు వస్తే పంట తొలగించకపోతే భూమిలోపల ఉన్న కాయలు మొలకలు వస్తాయి. తొలగిస్తే వేరుశనగ కట్టె, కాయలు నల్లగా మారి బూజు పట్టే ప్రమాదం ఉంది. ఎటు చూసినా రైతుకు నష్టమే. దీంతో వానదేవుడా కొన్నాళ్లు వానకు రెస్ట్ ఇవ్వవయ్యా స్వామి అని ఆకాశంలోని మబ్బుల వైపు చూసి వేడుకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 1200 ఎకరాలకు పైబడి వేరుశనగ సాగు చేశారు. ఈ సారి వేరుశనగ క్వింటా ధర రూ. ఆరు వేల నుంచి రూ. ఏడువేల దాకా పలుకుతోంది. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉంది. అయితే గత కొన్ని రోజులుగా జడివాన కురుస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ కట్టె, కాయలు పనికిరాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులే..: రాజప్ప, వేరుశనగ రైతు, కంబదూరు



గత కొన్ని రోజులుగా కురిసిన వర్షానికి తొలగించిన వేరుశనగ కట్టెకు తేమశాతం అధికం అవుతోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధిక తేమశాతంతో వేరుశనగ కట్టె అంతా నల్లగా మారిపోయింది. దాంతోపాటు తొలగించిన కట్టెకు మొలకలు వస్తున్నాయి. ఈ తేమశాతం పూర్తిగా పోవాలంటే ఎండ వేడిమి అధికం కావాలి. అప్పటివరకు ఈ కష్టాలు తప్పవు. నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. సుమారు రూ. 1.2 లక్షల దాకా పెట్టుబడి పెట్టా. ఈ అధిక వర్షాలతో నష్టాలు తప్పేలా లేవు.

ఇళ్లలో నీటి ఊట

- ఆందోళనలో బెళుగుప్ప గ్రామస్థులు



గదిలో ఉన్న ఊటనీరు



బెళుగుప్పలో ఊటనీటిని మోటార్లతో బయటకి పంపిస్తున్న దృశ్యం



చేతిపంపు నుంచి ఉబికి వస్తున్న నీరు

బెళుగుప్ప, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో మండల కేంద్రంలో మునుపెన్నడూ చూడనివిధంగా ఊట నీరు ఎక్కువైంది. ప్రతి ఏటా వ్యవసాయ బోరుబావుల్లో నీటి మట్టం తగ్గి పంటల సాగు చేసుకోలేక రైతులు ఇబ్బంది పడేవారు. ఈ ఏడాది మాత్రం భారీ వర్షాలతో ఎక్కడ చూసినా నీరు పుష్కలంగా లభిస్తోంది. బెళుగుప్పలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోనే నీరు ఊరుతోంది. గ్రామానికి అరకిలోమీటర్ దూరంలో ఉన్న మంగోటి చెరువుకు ఈ ఏడాది జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణ జలాలు పుష్కలంగా వదిలారు. అలాగే నాగుల చెరువు భారీ వర్షాలకు నిండిపోయింది. దీంతో గ్రామం లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. చేతిపంపుల నుంచి కూడా భూగర్భజలాలు రేయింబవళ్లు బయటకు వస్తున్నాయి. వ్యాపార సముదాయాలు, ఇంటి సెల్లార్లలో నీరు ఊరుతుండటంతో వాటిని మోటార్ల ద్వారా బయటకి తోడేస్తున్నారు. ఊటనీటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో, ఏ ఇల్లు కూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ నీరు ఉండటంతో విషపురుగుల సంచారం ఎక్కువైందని, ఇలాంటి పరిస్థితి గ్రామంలో గతంలో ఎన్నడూ చూడలేదని, వేసవి వచ్చేవరకు ఈ ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయమేస్తోంది



మా ఇంటి పక్కన పది అడుగుల లోతులో ఊట నీరు నిల్వ ఉంది. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. ఇళ్లలోని నీటిని మోటార్లతో తరలిస్తున్నా, కొద్ది సేపటికే మళ్లీ నీటి ఊటతో నిండిపోతోంది. ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో బతుకుతున్నాం.

-శివశంకర, బెళుగుప్ప గ్రామం



గ్రామ సమీపంలోని నాగులచెరువు

కోలుకునేది ఎలా..?

భారీగా తగ్గిన టమోటా ధర

నెల కిందట 25కిలోల బాక్స్ రూ.800

నేడు రూ.150 నుంచి రూ.200 కూడా కష్టమే

నష్టాల్లో రైతులు



యాడికిలో స్టేకింగ్ పద్ధతిలో సాగుచేసిన టమోటా



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన టమోటా బాక్సులు

యాడికి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నెలకిందటి వరకు మంచి లాభాలు ఇచ్చిన టమోటా ప్రస్తుతం అన్నదాతను ఏడిపిస్తోంది. నెల కిందట 25కిలోల బాక్స్ గరిష్ఠంగా రూ.900 ధర పలికింది. అదే నేడు రూ.150 నుంచి 200 పలికేది కూడా కష్టంగా మారింది. మండలంలో యాడికి, రాయల చెరువు, లక్షుంపల్లి, వెంగన్నపల్లి, చందన, దైవాలమడుగు తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేశారు. పంటలు ప్రస్తుతం కోతదశలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ధరలు పడిపోవడంతో సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి

ఎకరా పొలంలో టమోటా పంట సాగు చేయడానికి రూ.70వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని తెలిపారు. స్టేకింగ్ పద్ధతిలో టమోటా సాగుకు రూ.1.5లక్షలకు పైగా ఖర్చుచేస్తున్నారు. పెట్టుబడికి తగ్గట్లు పంట దిగుబడి చాలా బాగా వచ్చిందని, ధరలే దారుణంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. 100 బాక్సుల టమోటాలకు 20బాక్సులు సూట్ ఇవ్వాల్సి వస్తోందని, దీంతో కూలీల ఖర్చు, రవాణా ఖర్చులకే పంట దిగుబడి సరిపోతోందని పలువురు రైతులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడిని పొలంలో నుంచి బయటకు తీయలేకపోతున్నామని తెలిపారు. దీంతో తోటల్లోనే టమోటా మాగిపోతున్నాయని తెలిపారు. మండలంలో టమోటా దిగుబడిని రైతులు నంద్యాల జిల్లా ప్యాపిలి, అనంతపురం, గుత్తి, తాడిపత్రి వంటి మార్కెట్లకు తరలించి, విక్రయిస్తారు. టమోటా స్టాక్ ఎక్కువ వచ్చిన సమయంలో నోసేల్ బోర్డులు పెడుతున్నారని దీంతో చేసేదేమిలేక వారు అడిగిన ధరలకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు.

ఇటీవల వర్షాలకు తీవ్ర నష్టం

గత మూడు వారాలుగా తెరిపిలేని వర్షాలు కురవడంతో టమోటా పంటకు తీవ్ర నష్టం కలిగింది. ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో పొలంలో టమోటా కాయలను కోసి మార్కెట్‌కు తరలించలేకపోతున్నారు. దీంతో తోటల్లో టమోటాలు మాగిపోయి పంట నష్టపోవాల్సి వచ్చిందని పలువురు రైతులు తెలిపారు. అలాగే వర్షాల వల్ల ఇతర రాష్ట్రాలకు టమోటా ఎగుమతి జరగకపోవడంతో ధరల పతనం మొదలైనట్లు రైతులు తెలిపారు.

బాక్స్ రూ.200 పలకడం లేదు



స్టేకింగ్ పద్ధతిలో రెండు ఎకరాల్లో టమోటా సాగుచేశా. మూడు లక్షల పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగా వచ్చింది. అయితే టమోటా బాక్స్ ధర రూ.200 కూడా పలకడం లేదు. ధరలు ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టపోవాల్సిందే. వర్షాల ప్రభావంతో మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టానుసారంగా టమోటా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. టమోటాకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలి.

-రమేష్, టమోటా రైతు

పెట్టుబడి కూడా రాదు



రెండు ఎకరాల్లో పంట సాగుకు సుమారు రూ.1.8లక్షలు పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగున్నా, ధరలు లేవు. ఫస్ట్ గ్రేడ్ టమోటా 15కిలోల బాక్స్ నెల కిందట రూ.800 ధర పలికింది. ప్రస్తుతం రూ.200 కూడా పలకడం లేదు. ఈ ధరలు కూలీలు, రవాణా ఖర్చులకే సరిపోతాయి. రైతులకు పెట్టుబడి కూడా రాదు. వర్షాలతో టమోటా ఎగుమతి లేకపోవడమే ధరలు పడిపోవడానికి ముఖ్యకారణం.

-శేఖర్, టమోటా సాగురైతు, రాయలచెరువు

ఎగుమతులు లేకనే...



1.5ఎకరాల్లో స్టేకింగ్ పద్ధతిలో టమోటా సాగుచేశా. ఎకరాకు రూ.1.6 లక్షల వరకు పెట్టుబడి వచ్చింది. దిగుబడి బాగా వచ్చిన ధరలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల టమోటాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కావడం లేదు. దీంతో ధరలు బాగా తగ్గిపోయాయి. రైతులకు పెట్టుబడి కూడా వచ్చే అవకాశాలు లేవు.

-మధుసూదన్‌రెడ్డి, టమోటా రైతు

పోలీసుల ఒత్తిడితో గుండెపోటు

అనంతలో గిరిజనుడి మృతి

మృతదేహంతో స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

శింగనమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు, జూదరులతోపాటు ఆ ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన ఓ గిరిజనుడి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. ఉదయాన్నే స్టేషన్‌కు రావాలని సూచించారు. దీంతో రాత్రంతా ఒత్తిడికి లోనైనా ఆ వ్యక్తి.. ఉదయం స్టేషన్‌కు వెళ్లేందుకు గడప దాటగానే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. పోలీసుల కారణంగానే నిండు ప్రాణం బలైందని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు, శింగనమల మండలం నాగులగుడ్డం తండాలో పేకాట ఆడుతున్నట్లు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో తనిఖీలకు వెళ్లారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని, ఆ ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన రామకృష్ణ నాయక్(38)ను పట్టుకున్నారు. నలుగురి సెల్‌ఫోన్‌లను లాక్కుని, ఉదయాన్నే శింగనమల పోలీస్ స్టేషన్‌కు రమ్మని సూచించి వెళ్లిపోయారు. దీంతో రామకృష్ణ తీవ్ర ఆందోళనకు లోనయ్యాడు. రాత్రంతా నిద్రలేకుండా గడిపాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లేందుకు సోమవారం ఉదయం సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఒత్తిడికి లోనై గడప దాటగానే పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే శింగనమల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు సీపీఆర్ చేశారు. అయినా ప్రాణాలు నిలవలేదు. గుండెపోటు కారణంగా మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలియగానే బాధితుల బంధువులు, తండావాసులు, టీడీపీ, వైసీపీ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ కౌలుట్లయ్య అక్కడికి వెళ్లి బాధితులతో చర్చించారు. విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయినా బాధితులు శాంతించలేదు. మృతదేహాన్ని స్ట్రెచర్‌పై పెట్టుకుని పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లి ధర్నా చేశారు. రామకృష్ణ నాయక్ టీడీపీ కార్యకర్త కావడంతో శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నాయకులు మారుతినాయుడు, గుత్తా ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, సత్తి, అనిల్, మాసూల చంద్ర తదితరులు బాధిత కుటుంబం తరఫున పోలీసులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి పరిహారం ఇస్తామని సీఐ హామీ ఇచ్చారు. మృతుడి భార్యకు తండాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టును ఇప్పిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. దీంతో తండావాసులు రామకృష్ణ మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకువెళ్లారు. తండాలో రామకృష్ణ చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.



శింగనమల పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రామకృష్ణ నాయక్ కుటుంబ సభ్యులు, తండావాసులు

విచారణకు ఆదేశించిన ఎస్పీ: రామకృష్ణ నాయక్ మృతిపై ఎస్పీ జగదీశ్ విచారణకు ఆదేశించారు. పోలీసుల ఒత్తిడి కారణంగానే రామకృష్ణ నాయక్ మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగడంతో ఎస్పీ స్పందించారు. డీఎస్పీ స్థాయి అధికారిచేత పాదర్శకంగా విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు.

పరామర్శించిన ఎమ్మెల్యే: రామకృష్ణ నాయక్ మృతి గురించి టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్ చేసి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కుంటెన్న(ఫైల్)

ఆత్మకూరు సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. యాలేరు గ్రామానికి చెందిన రైతు కుంటెన్న(38) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కుంటెన్న తనకున్న 8.3 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకునేవాడు. వ్యవసాయంలో తీవ్ర నష్టాలు రావడంతో అప్పులు దాదాపు రూ.10లక్షలకు చేరాయి. వీటిని ఎలా తీర్చేదంటూ తరచూ ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య ముత్యాలక్క, కొడుకు సాయికిషోర్, కుమార్తె వెన్నెల కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లాప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తా

● మహిళా కూలీ మృతి, నలుగురికి గాయాలు

కణేకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడచేడు వద్ద సోమవారం వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తా పడి మహిళా కూలీ మృతిచెందగా.. నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని తుంబిగనూరుకు చెందిన మహిళా కూలీలు గౌరమ్మ, వనజాక్షి, చిన్నక్క, గంగమ్మ, సుజాతమ్మ సోమవారం ఉదయం గరుడచేడు వద్ద ఓ పొలంలో వేరుశనగ నూర్పిడి పనులకు వెళ్లారు. వీరంతా ట్రాక్టర్ వెనుకభాగాన కట్టుకున్న నూర్పిడి యంత్రంపై కూర్చున్నారు. గరుడచేడు, మీండ్లపల్లి వద్ద ప్రధాన రహదారి నుంచి పొలాలకు వెళ్లే దారివైపు తిప్పగా నూర్పిడి యంత్రం బోల్తాపడింది. ప్రమాదంలో గౌరమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. వారందరినీ కణేకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిని మోసగించిన యువకుడు

● ఏటీఎం నుంచి రూ.35 వేలు కాజేసిన వైనం

గోరంట్ల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): వృద్ధుడిని మోసగించి ఏటీఎం నుంచి ఓ యువకుడు రూ.35వేలు కాజేసిన సంఘటన సోమవారం గోరంట్లలో జరిగింది. పుట్టపర్తి మండలం పెడబల్లికి చెందిన 65 ఏళ్ల గ్యాగేనాయక్ గోరంట్లలోని ఏటీఎం వద్దకు వచ్చి అక్కడున్న యువకుడిని రూ.10వేలు డ్రాచేసి ఇవ్వాలని కోరాడు. రూ. పదివేలు ఒక్కసారిగా రావని, రూ. ఐదువేల వంతున రెండుమార్లు డ్రా చేసి ఇస్తానని చెప్పి, డ్రాచేసి ఇచ్చాడు. అనంతరం రెడ్డెప్పనాయుడు అనే పేరు ఉన్న మరో ఏటీఎం కార్డును వృద్ధుడి చేతిలో పెట్టి యువకుడు జారుకున్నారు. మళ్లీ నగదు డ్రా చేయడానికి ప్రయత్నించినా రాకపోవడంతో వృద్ధుడు బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ అధికారులతో ఆరా తీయగా తనఖాతా నుంచి రూ.35వేలు డ్రా చేసినట్లు గుర్తించాడు. మోసంతో తన సొమ్ము కాజేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



ఈసారి సత్య (ఫైల్)

యాడికి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీకి చెందిన ఈసారి సత్య (23) సోమవారం సాయంత్రం ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు యాడికిలోని నారాయణస్వామి కాలనీకి చెందిన తిరుపాలు, రమణమ్మ దంపతులకు నలుగురు కుమారులు ఉన్నారు. తిరుపాలు గతంలోనే మృతి చెందాడు. మొదటి, రెండో కుమారులు తిరుపతిలో ఉంటున్నారు. మూడో కుమారుడు ధర్మ, నాలుగో కుమారుడు సత్య తల్లి వద్దనే యాడికిలో ఉంటున్నారు. అవివాహితుడైన సత్య భవన నిర్మాణ పనులకు వెళ్లేవాడు. ఏమైందో ఏమో కాని సోమవారం సాయంత్రం ఇంటివద్ద ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి యువకుడి మృతి

శెట్టూరు, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో నీటి సంపులో పడి ముత్రాసి తరుణ్ (18) సోమవారం మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన మేరకు చిన్నంపల్లి గ్రామానికి చెందిన ముత్రాసి తరుణ్ ఉదయం నుంచి పొలంలో వేరుశనగ కట్టె తరలించే పనులు చేశాడు. మధ్యాహ్న సమయంలో ఓ వ్యవసాయ పొలంలో నీటి సంపు వద్ద కాళ్లు చేతులు కడుక్కుని వస్తానని వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి పోయాడు. ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందాడు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో బంధువులు అక్కడికి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సీఈఓ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించి, తీర్మానాలు చేయనున్నారు.

టమోటా కిలో రూ.15

అనంతపురం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.15తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.8, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధరరూ.11వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 593టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కిలేడీలు..!

● వేర్వేరు ప్రాంతాల్లో 14 రోజుల వ్యవధిలో 10 చోరీలు
● అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా అరెస్టు
● రూ.7.5 లక్షల నగదు, కారు స్వాధీనం

● బ్యాంకుల వద్ద రెక్కీ ● ఖాతాదారులను వెంబడించి.. నగదు అపహరణలు



పట్టుబడిన కారు, నగదుతో డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్, సిబ్బంది

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంకుల వద్ద రెక్కీ నిర్వహించడం, పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి ఆ సొమ్ము కాజేయడం మొదలెట్టారు. అలా.. 14 రోజుల వ్యవధిలో వేర్వేరు రాష్ట్రాల్లో ఏకంగా 10 చోరీలు చేశారు. అందుకోసం రెండు కార్లను తీసుకుని, ఇద్దరు డ్రైవర్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఆఖరుకు ఆ మహిళా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా ఆట కట్టించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గర్ జిల్లా కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన దీప్ మాలాబాయి, ఫరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, కారు డ్రైవర్ ప్రదీప్ సిసోడియా పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప.. దొంగల ముఠా అరెస్టు వివరాలను సోమవారం వెల్లడించారు. కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రెండు కార్లను తీసుకుని, చోరీలు మొదలెట్టారు. ఈనెల 3న గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్టేట్ బ్యాంకు(గోరంట్ల శాఖ)లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు. మధ్యలో ఓ దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆయనను బ్యాంకు వద్ద నుంచే రెండు కార్లలో మహిళా ముఠా వెంబడించింది. దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ద్విచక్రవాహనంలోని రూ.3.80 లక్షల నగదును చోరీ చేశాయి. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. దీప్ మాలాబాయి, ఫరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, మరో ఇద్దరు మహిళలు, ప్రదీప్, మరో కారు డ్రైవర్ ముఠా చోరీ చేసినట్లు గుర్తించారు. గోరంట్ల మండలంలో జాతీయర రహదారి పక్కనేకె హోటల్ వద్ద ఆదివారం ఐదుగురు మహిళలు, కారు డ్రైవర్ ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వరుస చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈనెల 3వ తేదీ మధ్య ఏకంగా పది చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. కడప జిల్లా పులివెందుల, జమ్మలమడుగులో మూడు, తెలంగాణలో మూడు, నంద్యాల జిల్లా, కర్ణాటక, ఒడిశాలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున మొత్తం పది చోరీలు చేసి, రూ.12.59 లక్షలు అపహరించారు. వారి నుంచి మొత్తం 7.50 లక్షలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు.. కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య పేర్లను రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో చొరవ చూపిన కానిస్టేబుళ్లు వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, హోంగార్డు ప్రియాంకకు నగదు బహుమతులను డీఎస్పీ అందజేశారు. ముఠాలో మరో ఇద్దరు వహిళలు, డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

మోక్షగుండం అడుగుజాడల్లో నడవాలి

● పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ రెడ్డి



ఇంజనీర్స్ డేలో పాల్గొన్న పీఆర్ ఇంజనీర్లు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) ఇంజనీరింగ్ మేధావి, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో ప్రతి ఇంజనీర్ పయనించాల్సిన అవసరం ఉందని పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక జడ్పీ ఆవరణలోని ఈఈ కార్యాలయంలో ఇంజనీర్స్‌డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈఈ ప్రభాకర్‌రెడ్డి మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో పీఏ టూ ఈఈ గురుమూర్తి రావు, ఏఈ వేంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ విభాగంలో..

జడ్పీ ఆవరణలోని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ సబ్‌డివిజన్-1 డీఈ లోకన్న, సబ్‌డివిజన్-2 డీఈ రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విభాగంలోని పలువురు ఇంజనీర్లతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



క్వాలిటీ కంట్రోల్ విభాగంలో నివాళులు అర్పిస్తున్న డీఈలు లోకన్న, రవీంద్ర

పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణానికి నిధుల మంజూరు

హిందూపురం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): హిందూపురంలోని పాతపట్టుగూళ్ల మార్కెట్ సముదాయంలో నూతనంగా మార్కెట్ నిర్మించడానికి రూ.8కోట్లు నిధులు మంజూరుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. 2024-25లో సిల్క్ సమగ్ర-2 పథకం కింద జనరల్ కేటగిరీ నిధుల మంజూరు చేశారు. ఇంతకు ముందే నాలుగు కోట్లు మంజూరు చేయగా ఆ నిధులు సరిపడవని పట్టురైతుల తరపున ఎమ్మెల్యే బాలకృష్ణ ఎనిమిది కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో కేంద్రం వాటా కింద నాలుగుకోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పట్టుపురుగుల అభివృద్ధి శాఖ నుంచి మరో నాలుగుకోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఉన్న పాత మార్కెట్‌ను కూల్చివేసి దానిస్థానంలో నూతనంగా అత్యాధునిక సదుపాయాలతో నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి రోజు మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి, ఈనెల 18న యాడికి, 19న రాప్తాడు మండలం గాండ్లపర్తి, ఈనెల 20న కూడేరు మండలం కమ్మూరు, ఈనెల 23న ఆత్మకూరు మండలం సిద్దరాంపురం, ఈనెల 27న బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి, ఈనెల 30న గుత్తి మండలం తొండపాడులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించే విషయాన్ని ఆయా ప్రాంతాల్లో ముందే రోజే టామ్‌టామ్ వేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

19న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి బాల, బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 19న నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ సుదర్శన్ తెలిపారు. జిల్లా స్థాయిలో అండర్-14, 16, 18, 20 బాల, బాలికల కేటగిరిలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెలాఖరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు అర్హులవుతారన్నారు.

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్టాపింగ్

గుంతకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా బెంగళూరు-నాందేడ్-బెంగళూరు మధ్యన నడిచే ఎక్స్‌ప్రెస్ (16593/94) రైలుకు నగరూరు రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-ఆదోని రైల్వే సెక్షన్‌లో ఉన్న నగరూరు స్టేషన్‌లో నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రయోగాత్మకంగా ఒక నిమిషం నిలపనున్నట్లు తెలియజేశారు. బెంగళూరు-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (16593) రైలును ఈ నెల 18 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (16594)ను 19 నుంచి నగరూరులో నిలపనున్నట్లు వివరించారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పులకుంట గ్రామానికి చెందిన అక్కమ్మ (90) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. గ్రామ సర్పంచ్ కొల్లాపురమ్మ అత్త అయిన అక్కమ్మ ఆదివారం మృతి చెందగా రెడ్ క్రాస్ సొసైటీ సంస్థకు సమాచారం ఇచ్చారు. సంస్థ ప్రతినిధులు గ్రామానికి చేరుకుని అక్కమ్మ నేత్రాలను సేకరించారు.

అయినా.. తప్పిదాలా..?

(5వ పేజీ తరువాయి)

ఉన్నట్లు కాల్‌లెటర్ పంపారు. ఆయన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రాగా.. లేటెస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి విద్యాశాఖ పంపింది. అక్కడకు వెళ్లిన ఆయన.. వైద్యుడు పరీక్ష చేయకనే వెళ్లిపోయారు. దీనిపై విద్యాశాఖకు డాక్టర్ సమాచారం ఇచ్చారు. దీంతో విద్యాశాఖ అధికారులు సైతం రాష్ట్రశాఖకు శ్రీనివాసులు పరీక్ష చేయించుకోకుండా వెళ్లిపోయారని నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనివాసులు.. డీఈఓ కార్యాలయానికి వచ్చి.. తాను వెళ్లిపోలేదనీ, సర్టిఫికెట్లు ఇవ్వడానికి పరిశీలన కేంద్రానికి వెళ్లానని చెప్పుకున్నారు. తమ చేతుల్లో ఏమీలేదని జిల్లా అధికారులు చెప్పారు. దీంతో ఆయన రాజధానికి వెళ్లి, విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి న్యాయం చేయాలని వేడుకున్నారు. దీంతో కమిషనర్ సీరియస్‌గా స్పందించారు. శ్రీనివాసులును దగ్గరుండి డాక్టర్ వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు ఈనెల 4వ తేదీన డీఈఓ ప్రసాద్‌బాబు, సూపరింటెండెంట్ ఆదినారాయణ, ఏపీ మంజునాథ్ స్వయంగా శ్రీనివాసులును ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యుడితో పరీక్ష చేయించారు. శ్రీనివాసులుకు మానసిక జబ్బులేదనీ, ఎంఐకి అనర్హుడని వైద్యుడు నివేదిక ఇచ్చారు. ఆ రిపోర్టును విద్యాశాఖ అధికారులు స్వయంగా తెచ్చుకున్నారు. అయినా కురుబ శ్రీనివాసులు సోషల్ సబ్జెక్టులో ఎంఐ కేటగిరీ కింద ఎంపికైనట్లు తుది జాబితాలో పేరు వచ్చింది. దీనిపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

అధిక మార్కులు వచ్చినా..

ఎస్సీ గ్రేడ్-2 కేటగిరీలో సోషల్ సబ్జెక్టులోనాలుగు పోస్టులు ఉన్నాయి. ఎస్ నాగరాజు అనే అభ్యర్థి 76.88 మార్కులతో 43వ ర్యాంకులో నిలిచారు. ఈయన ఓపెన్(ఓసీ) జనరల్‌లో ఎంపికయ్యారు. ఆ తర్వాత మరో నాగరాజు అనే అభ్యర్థి 76.82 మార్కులతో 44వ ర్యాంకులో ఉన్నారు. మిగిలిన మూడింటిలో తొలి పోస్టుకు నాగరాజును ఎంపిక చేయాలి. అలాకాకుండా 75.06 మార్కులు వచ్చినసూరి, 74.83 మార్కులు సాధించిన మహేష్‌ను ఎంపికచేసి జాబితాలో ముందుపెట్టారు. 76.82 మార్కులతో రెండోస్థానంలో ఉన్న నాగరాజుకు నాలుగో అభ్యర్థిగా ఫైనల్ జాబితాలో అవకాశం ఇవ్వడంతో ఆయన షాక్‌కు లోనయ్యారు. డీఈఓ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు.

డీఈఓ మెడకు ఉచ్చు

ఎంఐ కేటగిరీలో అనర్హుడని డాక్టర్ సర్టిఫికెట్ ఇచ్చినా సోషల్ సబ్జెక్టులో ఎంపిక జాబితాలో ఆయన పేరు ఉండడం డీఈఓ మెడకు చుట్టుకుంటోంది. ఈ అక్రమ వ్యవహారం, నిర్లక్ష్యంపై కమిషనర్ విజయరామరాజు, ఆర్జేడీ శామ్యూల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ఐదుసార్లు సర్టిఫికెట్ల పరిశీలన చేయించినా ఇలా ఎందుకు జరిగింది, ఇందులో ఎవరి పాత్ర ఉందనీ, వారిని గుర్తించే పనిలో డీఈఓతోపాటు కమిషనర్, ఆర్జేడీ నిమగ్నమయ్యారు. ఈ వ్యవహారంలో ఎవరిపై వేటు పడతుందోనని విద్యాశాఖలో ఉత్కంఠ నెలకొంది.

కాల్ లెటర్లు వచ్చినా పేరు లేదు..

డీఎస్సీ కాల్‌లెటర్ వచ్చిందనీ, సర్టిఫికెట్ల పరిశీలనకు కూడా హాజరయ్యామనీ, అయినా తుది జాబితాలో పేరులేదని చాలా మంది అభ్యర్థులు డీఈఓ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. జిల్లాలో 773 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు వచ్చాయి. వీరందరి సర్టిఫికెట్లను ప్రత్యేక కమిటీలు పరిశీలించాయి. 807 పోస్టులకుగాను 755 మంది అభ్యర్థులనే ఫైనల్ జాబితాలో ప్రకటించారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చి ఇపుడు జాబితాలో పేర్లులేని అభ్యర్థులు డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రాలు ఇస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఈఓ స్పందిస్తూ.. రెండు, మూడు పోస్టులకు ఎంపికైనఅభ్యర్థులు ప్రాధాన్యత ప్రకారం ఎంపికై ఉంటారనీ, ఆ క్రమంలో కొంతమందికి అవకాశం లేకుండా పోతుందన్నారు. అలాంటి వారి కోసం కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, అనుమానాలను నివృత్తి చేయించారు.

పశువులకు టీకా వేయించండి

● పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్



రాప్తాడులో ఆవుకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్యాధికారి

అనంతపురం అర్బన్/రాప్తాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాలి కుంటు వ్యాధి సోకకుండా పశువుల యజమానులు టీకా వేయించాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ సూచించారు. సోమవారం రాప్తాడులో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి అనంతపురం డీడీ రమేష్‌రెడ్డి, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబులతో కలిసి పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ హాజరై పలు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. అక్టోబరు 15వతేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తామన్నారు. జిల్లాకు 320500 గాలికుటుంబ వ్యాధి నివారణ టీకాల డోస్‌లను అందుబాటులో ఉంచామన్నారు. టీకా వేసిన పశువుల చెవులకు పోగులు వేసి, ట్యాగ్ రూపంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. అనంతరం ఆత్మకూరు మండలం గొరిదిండ్లలో పశువుల గాలి కుంటు టీకాలకు సంబంధించి రక్తన మూనాలు సేకరించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు శృతి, తేజస్విని, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారిత వీర్యం వినియోగాన్ని ప్రోత్సహించాలి

జిల్లాలో లింగ నిర్ధారిత వీర్యం వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మంగళవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. అక్టోబరు 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కృత్రిమ గర్భాధారణ సాంకేతిక నిపుణులు తప్పనిసరిగా ఆయా కార్యక్రమాలకు హాజరై లింగ నిర్ధారిత వీర్య గర్భధారణ ప్రాముఖ్యతను రైతులకు వివరించాలన్నారు.

పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా టెన్నిస్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఉమ్మడి జిల్లా టెన్నిస్‌బాల్, బీచ్ వాలీబాల్, మోడ్రన్ పెంథలాన్ క్రీడాకారులను ఎంపిక చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను సోమవారం వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. టెన్నిస్‌బాల్ అండర్- 14, 17, బాల, బాలికల కేటగిరిలో 20మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. బీచ్‌వాలీబాల్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాలలో 12మందిని ఎంపిక చేశారు. మోడ్రన్ పెంథలాన్ అండర్-17, 19 బాల, బాలికల్లో 30మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డైట్ కాలేజీ పీడీ రామకృష్ణ, హెచ్‌ఎం వీరన్న, ఎస్‌జీఎఫ్ సభ్యులు పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, పీఈటీలు నిరంజన్ రెడ్డి, ఓబుళేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు పెరవలి విద్యార్థులు

శింగనమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు పెరవలి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపియ్యారు. అనంతపురంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్-19 బాలురు విభాగంలో రాజ్‌పుల్లయ్య అండర్-17 బాలురు విభాగంలో బి. రాఘవేంద్ర, ఎస్ మోహన్‌నాయక్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం హరినాథ్, పీడీ నరసింహారెడ్డి తెలిపారు.

పరిటాల శ్రీరామ్‌కు భద్రత కల్పించండి

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

ధర్మవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు 2+2 భద్రత కల్పించాలని హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. టీడీపీ హయాంలో పరిటాల శ్రీరామ్‌కు 2+2 భద్రత ఉండేది. వైసీపీ అధికారం చేపట్టాక టీడీపీ నేతలను టార్గెట్ చేసింది. అందులో భాగంగానే పరిటాల శ్రీరామ్‌కు భద్రతను పూర్తిగా తొలగించింది. దీనిపై అప్పట్లో పరిటాల శ్రీరామ్.. హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. పరిటాల శ్రీరామ్‌కు 2+2 భద్రత కల్పించాలని ప్రభుత్వానికి ఆదేశించింది.

దరఖాస్తు గడువు పొడిగింపు

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బార్‌ల లైసెన్స్ కోసం దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. 2025-28 నూతన బార్ పాలసీలో భాగంగా గతనెల 30న లాటరీ నిర్వహించగా మిగిలిన 9బార్‌లకు ప్రభుత్వం ఈ నెల 12న రీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 17న ఆఖరి తేదీ అన్నారు. అనంతపురంలో 3, గుంతకల్లులో 2, గుత్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి రాయదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయన్నారు. 17 సాయంత్రం 6 గంటల్లోగా దరఖాస్తు చేయాలన్నారు. 18న లాటరీ తీస్తామని ఆయన స్పష్టం చేశారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పని చేస్తున్న తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి జిల్లా విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో దశల వారీ ఆందోళనలు మొదలు పెట్టారు. అందులో భాగంగా నగరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంతోపాటు, పవర్ ఆఫీస్, ఈఈ, డీఈఈ, ఏఈఈ ఇతరత్రా కార్యాలయాలతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై తమ నిరసన తెలిపారు.

కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం: సీపీఐ


పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అక్కంపల్లి పంచాయతీ పరిధిలోని కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ దీపాల నిర్వహణ అధ్వానంగా ఉందని సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆయన అక్కంపల్లి పంచాయితీ పరిధిలోని సమస్యలపై పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీకి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీలోని ఎన్‌ఆర్ కాలనీ, ధర్మభిక్షం కాలనీ, అంబేడ్కర్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, సదాశివన్ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఎన్‌ఆర్ కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న స్థానికులు రోడ్డును ఆక్రమించారన్నారు. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా డ్రైనేజీల నీరు రోడ్డుపైకి చేరుతున్నాయన్నారు. దీంతో అపరిశుభ్రత ఏర్పడి దోమల బెడద అధికమవుతోందన్నారు. వీధి దీపాలు వెలగడం లేదన్నారు. వైఎస్సార్ కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కార్యదర్శి నరేష్, సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, నియోజకవర్గ నాయకులు శ్రీకాంత్, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి శారద, మండల నాయకులు నారాయణస్వామి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ పెంపుతో క్రీడాకారులకు బంగారు భవిత


స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులతో డీఎస్‌డీఓ మంజుల

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ పెంచడంతో క్రీడాకారులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లైందని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. స్పోర్ట్స్ కోటా కింద పోలీస్ కానిస్టేబుల్ ఎంపికైన అభ్యర్థులు అరవింద్, కుమార్‌రెడ్డి, ఉపేంద్ర, అనిల్, రామకృష్ణ, ఉదయ్‌కుమార్, మనోజ్‌కుమార్, ప్రదీప్, నవీన్‌కుమార్‌ను సోమవారం ఆమె స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో అభినందించారు. ఏకంగా జిల్లాలో స్పోర్ట్స్ కోటా కింద 9మంది క్రీడాకారులు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

'షరతులు లేకుండా వాహనమిత్ర ఇవ్వాలి'

అనంతపురం విద్య, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా ఆటోవాలాలకు వాహనమిత్ర పథకం అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలో సోమవారం వారు ఆటోవాలాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు రాజేష్‌గౌడు, కృష్ణుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆటోకార్మికులకు వాహనమిత్ర ద్వారా ఆర్థికసాయంను దసరా నుంచి అమలు చేస్తామనడం ఆనందదాయకమన్నారు. అయితే వివిధ నిబంధనలు పెట్టి ఆటోకార్మికులకు అన్యాయం చేయకుండా అందరికీ ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, కృష్ణానాయక్, నరసింహులు, ముత్యాలు, వెంకటేష్, నల్లప్ప, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

ఆత్మకూరు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి, నాయకులు సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా నీలూరు రమణారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్జిత సెలవుల నగదు బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. డీఎలు, పీఆర్‌సీలు అలస్యమవుతున్న నేపథ్యంలో ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు నిట్టూరు చంద్రశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి రవి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి

● ఎంపీ అంబికాకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

అనంతపురంవిద్య, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు అనేకంగా అపరిష్కృతంగానే ఉన్నాయని, వాటిని సీఎం దృష్టికి తీసికెళ్లి న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలంటూ వారం రోజులుగా చేపడుతున్న నిరసనలో భాగంగా సోమవారం వారు ఎంపీని కలిసి మాట్లాడారు. ప్రభుత్వం టీచర్లకు బకాయిలు చెల్లించలేదని, డీఏలు ఇవ్వలేదని, ఐఆర్ ప్రకటించలేదని వాపోయారు. సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్రపూర్వకార్యదర్శి నరసింహులు, జిల్లా నాయకులు గాయిత్రి, సర్దార్‌వలి, వెంకటరమణ, ఓబిశేను, పర్వతయ్యారంగానాయుడు, నాగరాజు,సురేష్, సాధిక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మనమిత్రను తొలగించాలని వినతి


ఏఓకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రామగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులు ఆత్మగౌరవసమస్యకు కారణమవుతున్న మనమిత్ర డోర్ టు డోర్ కార్యక్రమాన్ని తొలగించాలని కోరుతూ రామగిరి మండల సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం ఏఓ వెంకటేశ్వరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. వలంటీర్ల విధులు నిర్వహించడానికి, క్లస్టర్ మ్యాపింగ్ చేయడానికి ఆదేశాలు ఇవ్వడం మమ్మలను ఆవేదనకు గురిచేసిందన్నారు. మా సమస్యల గురించి అధికారులకు పలు మార్లు తెలియజేసినా స్పందించలేదన్నారు. సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా అధికార వర్గాల ప్రవరిస్తున్న తీరును తాము నిరసిస్తున్నట్టు తెలిపారు. ఎక్కువ క్లస్టర్‌లు మ్యాపింగ్ చేసి ఇంటింటికీ తిరిగి వాట్సప్ సర్వీసింగ్‌కు సంబంధించి అవగాహన తదితర కార్యక్రమాలు బహిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య వేదిక తరఫున పిలుపునిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

దేశం గర్వించదగ్గ ఇంజనీర్ మోక్షగుండం


జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య


అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డేలో పాల్గొన్న చైర్మన్ అనంతరాముడు తదితరులు

● కొనియాడిన జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు
● ఇంజనీర్స్ డే సందర్భంగా ఘన నివాళి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యావత్ భారత దేశం గర్వించ దగ్గ ఇంజనీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శన్‌రావు కొనియాడారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరయ్యారు. ముందుగా వారు కళాశాలలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన ఓపెన్ డేలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్‌గా ప్రపంచ ఖ్యాతిని గడించాని గుర్తు చేశారు. ఇంజనీరింగ్‌కే పితామహుడన్నారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ..అత్యధికంగా ఇంజనీర్లను తాయరు చేస్తున్న దేశాల్లో ఇండియా ఒకటన్నారు. విశ్వేశ్వరయ్యని ఆదర్శంగా తీసుకుని ఇంజనీర్లంతా దేశాభివృద్ధిలో రాణించాలన్నారు. అనంతరం ఓపెన్ డేలో పాల్గొనగా.. యూనివర్సిటీ, కళాశాలలో ఉన్న అన్ని విభాగాలకు సంబంధించి అధునాతన ప్రయోగశాలలు, ఇంజనీరింగ్‌లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు, రీసర్చ్ యాక్టివిటీస్ గురించి విద్యార్థులు క్షుణ్ణంగా వివరించారు. డైరెక్టర్లు భానుమూర్తి, సత్యనారాయణ, ఈశ్వర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, సురేష్‌బాబు, నాగప్రసాద్‌నాయుడు, శివకుమార్, ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రొఫెసర్లు భువన విజయ, అరుణకాంతి, భవాని, భారతి, కళ్యాణ్‌కుమార్, దిలీప్‌కుమార్, చంద్రమోహన్‌రెడ్డి, రామశేఖర్‌రెడ్డి, కళ్యాణిరాధా, అజిత, శారద, మమత, శ్యాంబాబు, శంకర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎంఆర్ ధీరేంద్రబాబు అధ్యక్షతన కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి కళాశాల ముఖద్వారం వద్ద మోక్షగుండం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇంజనీరింగ్ విద్యార్థి రవికుమార్ మోక్షగుండం జీవితం, సేవలపై నాటకాన్ని ప్రదర్శించారు. అలాగే అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు హాజరై విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, స్కిల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సురేంద్రనాయుడు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ డీన్ మురళీధర్ పాల్గొన్నారు.

మండ్లి కిషోర్‌కు పాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డు


పాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న మండ్లి కిషోర్ కుమార్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడు మండ్లి కిషోర్ కుమార్ పాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. గుంటూరులోని కెన్నడీ నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఆ స్కూల్ నిర్వాహకుడు అనిల్ రామనాధం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దాదాపు వెయ్యి మంది ఉపాధ్యాయులకు ఆదివారం సాయంత్రం పాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం తరఫున సీవీఆర్ స్కూల్‌కు చెందిన డాక్టర్ మండ్లి కిషోర్ కుమార్‌కు ఇస్రో శాస్త్రవేత్త చందు సాంబశివరావు చేతులమీదుగా అవార్డును అందజేసి సత్కరించారు. కిషోర్ కుమార్ అవార్డు అందుకోవడం పట్ల సీవీఆర్ పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

రేపు విశ్వకర్మ జయంతి

అనంతపురం విద్య, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీ బుధవారం విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూకొఠారి సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని పాతూరులో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఉదయం 10:30 గంటలకు వేడుకలు నిర్వహిస్తామన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, అనధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జేపీ నడ్డాను కలిసిన బీజేపీ జిల్లా నాయకులు


జేపీ నడ్డాతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఆ పార్టీ జిల్లా నాయకులు కలిశారు. ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి పాల్గొని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా పార్టీ సంస్థాగత నిర్మాణంపై నాయకులు చర్చించారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వాలి

శింగనమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలో రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు సరాఫరా చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రైతు సేవా కేంద్రలో యూరియాతో పాటు ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వాలన్నారు. అలాగే మిడ్‌పెన్నార్ చివరి ఆయకట్టు భూములు వరకు నీరు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మధుయాదవ్ నేసేమధు చికెన్‌భాషా,వెంకటరెడ్డి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కనగానపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కనగానపల్లికి చెందిన ముత్యాలు బైక్‌లో పొలం వద్దకు వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో ముత్యాలు తలకు తీవ్రంగా గాయమైంది. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు.

అడుగడుగునా గుంతలే..

●నాయక్ నగర్ రైల్వే గేటు నుంచి జాతీయ రహదారి వరకూ అధ్వానంగా రోడ్డు
● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు


నాయక్ నగర్ రైల్వే గేటు నుంచి జాతీయ రహదారి వరకు గుంతల మయంగా ఉన్న రోడ్డు

రాప్తాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి అనంతపురం నగరాన్ని కలిపే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో గల ఆ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అనంతపురం నగర శివారులోని నాయక్‌నగర్ రైల్వే గేటు వద్ద నుంచి జాతీయరహదారి 44 వరకూ చాలా ఏళ్ల క్రితం తారురోడ్డు నిర్మించారు. ఈ దారి గుండా అనంతపురం నగరానికి ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు కావడంతో ప్రస్తుతం గుంతలు ఏర్పడ్డా యి. దారి పొడవునా ఎక్కడ చేసినా గుం తలే దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. దారంతా బురదమయంగా మారుతుండడంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. దీంతో ఆ దారి గుండా ప్రయాణం నరక ప్రా యంగా మారుతోంది. నాయక్ నగర్ రైల్వే గేటు పక్కనే ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ ఉంది. వివిధ రాష్ట్రాల నుంచి యూరియా, డీఏపీ, పొటాష్ వ్యవసాయానికి ఉపయోగించే ఇతర రసాయన ఎరువులు గూడ్స్ రైలు ద్వారా ఆ రైల్వే స్టేషన్‌కు వస్తాయి. అక్కడి నుంచి లారీల్లో బస్తాలు నింపుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. బస్తాలు నింపిన లోడ్ వాహనాలు దారి గుండా వెళ్లడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రేషన్ బియ్యం కూడా ఇతర రాష్ట్రాల నుంచి ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్‌కు వస్తాయి. అక్కడి నుంచి లారీల ద్వారా స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తున్నారు. బియ్యం, ఎరువుల లారీలు నిత్యం ఆ దారి గుండా ప్రయాణిస్తుండటంతో దారిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి నూతనంగా తారురోడ్డు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


తిరుమలలో తోటి ప్రజాప్రతినిధులతో బండారు శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దర్శించుకున్నారు. తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత పార్లమెంటరీ, శాసన సభ కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఆమె వెళ్లారు. దీంతో సోమవారం తోటి మహిళా ఎమ్మెల్యేలతో కలిసి తిరుమలలోని వేంకటేశ్వర స్వామి దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న మహాబృంద నృత్యం


జానపద నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్‌లో నిర్వహించిన మహాబృంద నృత్యం వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 2025 మంది జానపద నృత్య కళాకారులు జానపద నృత్యాలు చేస్తూ వీక్షకులను రంజింపజేశారు. ప్రదర్శనానంతరం నిర్వాహకులు కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో సురభి ఆనంద్, రమేష్ కుమార్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్ మాస్టర్లు పాల్గొన్నారు.

చల్లా లక్ష్మీప్రసాద్ నియామకం పట్ల హర్షం


చల్లా లక్ష్మీప్రసాద్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన లక్ష్మీప్రసాద్ ఇటీవల నియమితులయ్యారు. అనంతపురం అర్బన్ నియోజవర్గానికి చెందిన ఈయన గత కొన్నేళ్లుగా టీడీపీ అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ అధిష్టానం ఆయన సేవల్ని గుర్తించి ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమించింది. ఆయన నియామకం పట్ల టీడీపీ శ్రేణులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖామంత్రి నారాలోకేష్‌కు, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన లక్ష్మీప్రసాద్


వెంకటశివుడు యాదవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న లక్ష్మీప్రసాద్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌ను ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్ సోమవారం కలిశారు. ఏపీఐఐసీ డైరెక్టర్‌గా చల్లా లక్ష్మీప్రసాద్‌ను ప్రభుత్వం ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన నగరంలోని టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. తర్వాత వెంకటశివుడు యాదవ్ చల్లా లక్ష్మీప్రసాద్‌ను అభినందించి పార్టీకి, ప్రభుత్వానికి మంచి తేవాలని సూచించారు.

రెడ్డి కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని కులాల కార్పొరేషన్లకు పాలకవర్గాలను నియమించిన కూటమి ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్‌కు కూడా నియమించి, నిధులు మంజూరు చేయాలని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ఆయన డీఆర్ఓ మలోలాను కలిసిన వినతిపత్రం అందజేశారు. రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గ సభ్యులను నియమించి, నిధులు కేటాయించి రెడ్డి సామాజికవర్గంలోని పేదలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలోసంఘం జిల్లా అధ్యక్షుడు పాటిల్ రామకృష్ణారెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, హనుమంతరెడ్డి, అరవింద్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, అనిల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1791 మంది ఆత్మబంధువులకు పిండప్రదానం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహాలయ పక్షాలను పురస్కరించుకుని నగరంలోని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో 1791 మంది ఆత్మబంధువులకు అంత్యేష్టి, పిండప్రదానం చేశారు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఎవరూ లేని అనాథలు, నిర్భాగ్యులకు మొత్తం 1791 మందికి గతంలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మహాలయ పక్షాల నేపథ్యంలో వీరందరికీ సోమవారం ఏపీ, తెలంగాణ సరిహద్దులోని కృష్ణ, తుంగభద్ర నదుల సంగమ ప్రదేశంలో కర్నూలుకు చెందిన కొండా సిద్ధాంతి నేతృత్వంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ హిందూ సంప్రదాయ పద్ధతిలో శాస్త్రబద్ధంగా పిండ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సాయి సేవకులు డోన్ మధు, రమణ, రఫిక్, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గార్లదిన్నె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బండారు ఈరమ్మ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ రేషన్ కార్డులను ఏటీఎం కార్డు సైజులో, క్యూఆర్ కోడ్‌తో తయారు చేయించిందన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నివారించేందుకు ప్రభుత్వం నూతనంగా ఈ స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. త్వరలోనే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వీటిని పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ కంబక్క, వీఆర్వో సుధాకర్, డీలర్ సూర్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

●రాప్తాడు: మండలకేంద్రంతో పాటు బండమీదపల్లి, ఇతర గ్రామాల్లో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీని ప్రారంభించారు. సీఎస్‌డీటీ జ్యోతి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 12 వేల నూతన రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. ఈనెల నుంచి కొత్త రేషన్‌కార్డుదారులందరికీ బియ్యం పంపిణీ చేస్తామని అన్నారు. రేషన్‌కార్డు లేనివారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే విడతల వారీగా ప్రభుత్వం కార్డులు పంపిణీ చేస్తుందని అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ సాకే తిరుపాలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 34 రేషన్ దుకాణాల పరిధిలోని డీలర్లు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణమోహన్ చౌదరి, హిం దూపురం పార్లమెంటు అధికార ప్రతినిది శాశాంక చౌదరి, ఎంపీటీసీ సభ్యురాలు పారిజాతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

●శింగనమల: రేషన్ దారుల ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్‌కార్డు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో రేషన్ షాపు వద్ద లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటి వద్దకు సచివాలయం సిబ్బంది వచ్చి స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, సీఎస్‌డీటీ చంద్రకళ, టీడీపీ నాయకులు మారుతీనాయుడు ఎం.ఆదినారాయణ, సత్యనారాయణ, మాసూల చంద్ర, డీలర్లు తదతరులు పాల్గొన్నారు.

●అనంతపురం క్రైం: నగరంలోని జీసస్ నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను క్లస్టర్ ఇన్‌చార్జ్ సరిపూటి రమణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎమ్మార్వో హరి హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, రాయల్ మురళి, గాజుల ఆదెన్న, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, సీసాల శీన అధికారులతో కలసి పంపిణీ చేశారు.


గార్లదిన్నెలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ బండారు ఈరమ్మ


శింగనమలలో పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు


బండమీదపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులను చూపుతున్న లబ్ధిదారులు

గ్రామాల్లో వైద్య శిబిరాలు

గడేకల్లులో పర్యటించిన డీఎంహెచ్ఓ ఈబీ దేవి



గడేకల్లులో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ, యల్లనూరులో నిర్వహిస్తున్న వైద్యశిబిరం, యాడికిలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

విడపనకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లులో అనేక మంది జ్వరాల బారిన పడ్డారు. దీంతో గడేకల్లులో విషజ్వరాలు అనే శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. గడేకల్లులో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. పెద్ద కొట్టాలపల్లి వైద్యుడు జయ కుమార్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో సోమవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జిల్లా ప్రోగ్రాం వైద్యాధికారి నారాయ ణస్వామి గడేకల్లు గ్రామం చేరుకొని.. వీధులను పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. గ్రామలో పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి సోమయ్య, ఈఓఆర్డీ సత్యబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మురికి కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

● యల్లనూరు: మండలంలో విషజ్వరాలు ప్రబలుతుండటంపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో ఆసుపత్రి వైద్యులు స్పందించారు. కోటవీధి, జంగంపల్లి, బీసీకాలనీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. జ్వరాలు అధికంగా ఉన్న ఇళ్లవద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. వైద్యశిబిరంలో డాక్టర్ శివసాయి, సీహెచ్ఓ మధుకుమార్, సిబ్బంది హాజివలి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● యాడికి: మండల కేంద్రంలో అపరిశుభ్రత వల్ల అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారని ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన గ్రామపంచాయతీ సిబ్బంది వీధుల్లో పర్యటించి.. నిల్వ ఉన్న నీటిని తొలగించారు. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. డ్రైనేజీ కాలువల్లో దోమలు వ్యాప్తి చెందకుండా గ్రామపంచాయతీ సిబ్బందితో మందులను స్ప్రే చేయించారు. ఈ పనులను ప్రభుత్వ వైద్యుడు పరమేశ్వర్, మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఇతర ఉద్యోగులు పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



వెంకటలక్ష్మి

విడపనకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యూ వెంకటలక్ష్మి జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఎస్ఓ తులసి ప్రియా సోమవారం తెలిపారు. బత్తలపల్లి మండలంలోని రాంపురం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఈనెల 12 నుంచి 14 వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచూపిన వెంకటలక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపిక



నందకిషోర్

కూడేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నందకిషోర్ రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపికైనట్లు పీడీ హిమబిందు సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 13న జరిగిన జిల్లాస్థాయిలో ఈత పోటీల్లో నందకిషోర్ ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

● గుంతకల్లుటౌన్: మండలంలోని తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీ రాకేష్, ఎన్ అభిరామ్ జిల్లాస్థాయి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం ఎం నారాయణరెడ్డి తెలిపారు.

రాజేష్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజేష్

విడపనకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గం నారాలోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్షుడు మెక్కినేని రాజేష్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కింది. విజయవాడలో సోమవారం ఆయనకు ఆ అవార్డు అందజేశారు. హనుమంతరాయ గ్రంథాలయంలో ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మల్లాది ప్రసాద్‌రావు రాజేష్‌కు ఆ అవార్డు అందజేశారు.

బ్యాంక్ వద్ద రైతుల నిరసన

తాడిపత్రి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పంట రుణాల రెన్యువల్ విషయంలో బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతు సంఘం నాయకులు, రైతులు స్థానిక యూనియన్ బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేశారు. వడ్డీ కట్టించుకొని రుణాలు రెన్యువల్ చేయాల్సి ఉందని, అసలు వడ్డీ చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని బ్యాంక్ అధికారులు అంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి, సీపీఎం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్, జయశేఖర్‌రెడ్డి, పాపయ్య, సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేయాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక రామిరెడ్డి కాలనీ, జగ్జీవన్‌రామ్ కాలనీ, హనుమాన్ టెంపుల్ నుంచి భీమ్ రెడ్డి కాలనీ వరకు సీసీ రోడ్లను వేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ కోరారు. ఈ మేరకు అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు.

'మోక్షగుండం'కు ఘన నివాళి

తాడిపత్రి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురష్కరించుకొని.. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఆయన విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఈ సంపత్‌కుమార్, జయచంద్ర, పద్మనాభపిళ్లై, ఇనిగ్నేర్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బొమ్మనహాళ్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లకు, నేరచరిత్రగల వారికి ఎస్ఐ నబీరసూల్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

గుత్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో స్థానిక ఈఈ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 1999-2004 మధ్య చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని, జేఎల్‌ఎం గ్రేడ్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, డీఏలను తక్షణమే చెల్లించాలని కోరారు. అనంతరం ఈఈకు పద్మనాభ పిళ్లైకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 1104 సెక్రెటరీ నాగేంద్రప్రసాద్, నాయకులు రఫీ, సత్యనారాయణ, విన్సెంట్ కుమార్, సాయి ప్రకాష్,వెంకటేష్, సూర్యనారాయణ, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

● ఉరవకొండ : విద్యుత్ ఉద్యోగులు స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మేన్‌లు నబీరసూల్, శ్రీనివాసులు, రమేష్, యూడీసీలు రిహానా, ఉమాశంకర్‌లు, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి యూరియా ఇచ్చాం

అవసరమైతే మరింత ఇస్తాం: జేడీఏ



అధికారులు, టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న జేడీఏ

కణేకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు యూరియాను లక్ష్యానికి మించి ఇచ్చామని అవసరమైతే మరింత అందిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచించారు. సోమవారం మండలానికి వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. ఏటా రైతులకు జిల్లా వ్యాప్తంగా 26 వేల మెట్రిక్ టన్నులను అందించామని, ప్రస్తుత ఏడాది ఇప్పటికే 38 వేల మెట్రిక్ టన్నులు అందించామని, ఇంకా ఎనిమిది వేల మెట్రిక్ టన్నులను కూడా అందించబోతున్నామని అన్నారు. స్థానిక టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. కణేకల్లు మండలంలో అధిగ విస్తీర్ణంలో వరి పంట సాగుచేస్తునానరని, ఎక్కువ మోతాదులో రైతులకు అవసరమైనంత వరకు యూరియాను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ లాలెప్ప, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, కురుబ నాగరాజు, ఏఓ జగదీష్, ఎంపీఈఓ లాలూస్వామి పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ : ప్రతీ రైతుకు యూరియా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఆందోళన వద్దని రాయదుర్గం వ్యవసాయ ఏడీఏ పద్మజ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీధరఘట్ట సొసైటీ పరిధిలో ఉప్పరహాళ్ గ్రామ రైతులకు యూరియా పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్ఎస్‌కేల ద్వారా కూడా యూరియా పంపిణీ చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రంగన్న

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27వ వార్డులో నివాసముంటున్న మోహన్‌దాస్ (52) అనారోగ్యంతో సోమవారం మరణించాడు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు టీడీపీ మాజీ కౌన్సిలర్ ఎం రంగన్న మోహన్‌దాస్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీజన్ వ్యాధులు, దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు.. వాటి నివారణ చర్యలపై మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధులు ఎలా వ్యాపిస్తాయో వివరించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్లు ఎర్రిస్వామి, రవిశంకర్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కణేకల్లులో యూరియా కోసం ఎండలో క్యూలో ఉన్న రైతులు

యూరియా కోసం ఎండలో నిరీక్షణ

కణేకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. సోమవారం స్థానిక రూరల్‌బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్ సొసైటీలలో యూరియా పంపిణీ చేశారు. రైతులు యూరియా కోసం ఉదయం నుంచే క్యూలైన్‌లలో పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డులు, టవాళ్లను వాటిని ఉంచి.. గంటలకొద్దీ వేచి ఉన్నారు. ఒక్కో ఆధార్‌కార్డుకు ఒక్కో యూరియా బస్తాను పంపిణీ చేశారు.

ఆఫీసులు ఖాళీ.. విధుల పట్ల నిర్లక్ష్యం



శెట్టూరు సీసీల ఆఫీస్‌లో, నరసాపురం సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

శెట్టూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బంది లేక వెలవెలపోయింది. కార్యాలయంలో ఉన్న అకౌంటెంట్‌ను ఇబ్బంది ఎక్కడికి వెళ్లారంటే అడగ్గా... వెలుగు సీసీలు సంఘాల పర్యవేక్షణ కోసం గ్రామాలకు వెళ్లారని తెలిపారు. ఏపీఎం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్లారని తెలిపారు. అయితే వారు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఏపీఎం కనిపించలేదు. జిల్లా ఉన్నతాధికారులు వెలుగు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● సచివాలయ సిబ్బందీ అంతే..

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం సచివాలయంలో సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. సోమవారం అధికారులు ప్రజలకు అందుబాటులో సచివాలయంలో ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా.. పట్టించుకోవడం లేదు. 11 గంటలైనా ఒక్కరూ హాజరుకాలేదు.

గుర్రప్పస్వామికి మండల పూజ



పుట్లూరు, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో గుర్రప్పస్వామి మండల పూజను సోమవారం వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయంలో స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41 రోజులైన సందర్భంగా గ్రామస్థులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉరవకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మూలగిరిపల్లికి చెందిన అజయ్ (20) అక్కడికక్కడే మరణించాడు. ఇతను అజయ్ ఉరవకొండలోని టీ స్టాల్‌లో పనిచేసేవాడు. సోమవారం రాత్రి అజయ్, తన స్నేహితుడు జగన్ కలిసి బైక్‌లో ఉరవకొండకు వస్తుండగా, చిన్నముష్టూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అజయ్ అక్కడిక్కడే మృతిచెందగా, జగన్ తీవ్రంగా గాయపడ్డాడు. జగన్‌ను ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కిందపడి బేల్దారి..

డీ.హీరేహాళ్: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన బేల్దారి, మేస్త్రీ ఉలుగప్ప (40) ఉన్నట్టుండి కిందపడటంతో తలకు బలమైన గాయమై మరణించాడు. ఉలుగప్పకు రెండురోజులుగా ఛాతి నొప్పి అధికంగా ఉండడంతో ఆసుపత్రికి వెళ్లేందుకు బయలుదేరాడు. బస్టాండ్ సమీపంలోని సత్యమ్మకట్ట వద్ద మాట్లాడుతూ ఒక్కసారిగా కింద పడడటంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబసభ్యులు బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉలుగప్పకు భార్య లలితమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో బెటాలియన్ వెళ్లే రహదారిలో ముళ్లచెట్ల వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.14,350 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



జలాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

ఉరవకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జరుట్ల రాంపురం నుంచి గంగా జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ఏటా ఉత్తరకార్తెలో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామస్థులు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఏటా ఇలా పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేధో సంపత్తి హక్కులపై జాతీయ సదస్సును సోమవారం నిర్వహించారు. సదస్సుకు వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 300 మంది విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు హాజరయ్యారు. చెన్నైకు చెందిన కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ వక్త ప్రసాద్‌రావు మేధో సంపత్తి హక్కులపై ప్రాథమిక అవగాహన కల్పించడమే కాకుండా వాటిని ఏ విధంగా పరిరక్షించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, వైస్‌ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ జమిలాబీబీ, అధ్యాపకులు రామచేంద్రప్రసాద్, రాజశేఖర్, బసవరాజు, శివశంకర్, శ్రీనివాసులు, శివప్రసాద్ పాల్గొన్నారు.

18న హుండీ ఆదాయం లెక్కింపు

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గసంగాల గ్రామంలోని బుగ్గసంగమేశ్వర స్వామి దేవాలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కృష్ణయ్య తెలిపారు. ఉదయం 11గంటలకు ఆలయ ఆవరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించండి

కూడేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పంటలకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి.. సేంద్రీయ ఎరువులు వాడాలని కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్తలు మల్లేశ్వరి, శశికళ, కిషోర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొర్రకోడులో పంటలసాగుపై రైతులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని, దీంతో పెట్టుబడులు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శుభకర్, నిర్మలారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సోలార్‌ను వినియోగించుకుని విద్యుత్ ఆదా చేసేందుకు రూపొందించిన సూర్యఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్ కోరారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు ఈ పథకంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అధికారులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ సూర్యప్రతాప్, పట్టణ, మండల అధ్యక్షులు ఎంకే చౌదరి, బద్రివలి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా, రమేష్, రాజా, నాయకులు పవన్‌కుమార్, న్యాయవాది సోమశేఖర్, ఆంధ్రసోలార్ ఎంటర్‌ప్రైజస్ ప్రతినిధులు క్రాంతి, బీజేపీ నాయకులు ఓబలయ్య పాల్గొన్నారు.

● ఏపీటీఎఫ్ నాయకుల వినతి : తమ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడికి ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

● స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

అర్హులందరికీ 'వాహనమిత్ర' అందాలి

తాడిపత్రి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ వాహనమిత్ర పథకం అందాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వాహనమిత్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆ పథకం ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దసరా పండుగను పురష్కరించుకొని రేడియం జాకెట్లు, బ్లౌజులు, హెల్మెట్లు, చెట్లు కట్టింగ్ మిషన్లు అందజేశారు.

ఏపీటీఎఫ్ నిరసన

రాయదుర్గం రూరల్,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద స్థానిక నాయకులు గంటపాటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు సునీల్, ఆంజనేయులు, రామకృష్ణ, పాండురంగ, సిద్ధేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తాడిపత్రి : తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరులో స్మార్ట్ కార్డులు అందజేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

ఉరవకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఏఎంసీ ఛైర్మెన్లు రేగాటి నాగరాజు, మారెన్న మాట్లాడుతూ.. పేదలకు నిత్యావసర సరుకులను పారదర్శకంగా అందజేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్ బాషా, ఎంపీడీఓ శంకర్, టీడీపీ నాయకులు గోవిందు, ప్యారం కేశవానంద, తిమ్మప్ప, ఖలందర్, మాజీ సర్పంచులు గోవిందు, వెంకటేష్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.

●వజ్రకరూరులో అధికారులు, టీడీపీ నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు నరేష్, శివాజీ రెడ్డి, మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, దస్తగిరి, వలి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసిన నాయకులు

● కూడేరు : స్థానిక సచివాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, టీడీపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా తయారు చేసిన స్మార్ట్‌కార్డులు లబ్దిదారులందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు లలితమ్మ, డిప్యూటీ తహసీల్దారు ఉదయ్ భాస్కర్, సివిల్ సప్లై డీటీ శాంత, ఆర్ఐ విజయభాస్కర్ రెడ్డి, రేషన్ షాపులు అధ్యక్షుడు ఎంఎంహళ్లి రాజప్ప, వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●గుంతకల్లు : పట్టణంలో టీడీపీ కౌన్సిలర్ ఆర్ పవన్‌కుమార్ గౌడ్, ఇతర కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, స్టోర్ డీలర్లు ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

● రాయదుర్గం రూరల్ : డీలర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి స్మార్ట్‌కార్డులు అందజేస్తారని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మండలానికి 32 వేల స్మార్ట్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు.

● తాడిపత్రి : స్థానిక మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్థానిక తన నివాసంలో రేషన్‌డీలర్లు, అధికారులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

● శెట్టూరు, పామిడి, యల్లనూరు, యాడికి, కుందుర్పి, బెళుగుప్ప, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో ఈ కార్డులను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు.